## లక్కీడ్రాను సద్వినియోగం చేసుకోవాలి



డిపోలో ఏర్పాటు చేసిన లక్కీడ్రా బాక్స్‌లో టికెట్‌లను వేస్తున్న దృశ్యం

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబర్ 18 : దసరా పండుగను పురస్కరించుకొని ఆర్టీసీ బస్సులో ప్రయాణించే వారికి టీఎస్ ఆర్టీసీ బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఈనెల 30వ తేదీ వరకు బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీడ్రా నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎం శ్రీదేవి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆ తేదీల్లో ప్రయాణించే వారు టికెట్ వెనుక పేరు, ఫోన్‌నెంబర్ రాసి బస్టాండ్లలోని డ్రాప్ బాక్సుల్లో వేయాలని సూచించారు. ప్రతి రీజియన్ పరిధిలో ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలను ఎంపిక చేసి నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసి రాష్ట్రవ్యాప్తంగా 110 మందికి ఒక్కొక్కరికి రూ.9,900 చొప్పున రూ.11లక్షల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి బస్టాండ్‌లో మహిళలకు, పురుషులకు లక్కీడ్రా బాక్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## కూరగాయల సాగుతో లాభాలు



కూరగాయల సాగును పరిశీలిస్తున్న కేంద్రియ సస్యరక్షణ సహాయ అధికారి రవిశంకర్

కోయిలకొండ, అక్టోబర్ 18 : కూరగాయల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చునని కేంద్రియ సమగ్ర సస్యరక్షణ సహాయ అధికారి రవిశంకర్ అన్నారు. బుధవారం మండలంలోని కేశ్వాపూర్‌లో రైతులు పండిస్తున్న కూరగాయల సాగును పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు చేశారు.పంట మార్పిడి, ఆరుతడి పంటల సాగు ఎంతో లాభదాయకమని తెలిపారు. కార్యక్రమంలో రైతులు హన్మంతు, శ్రీశైలం, కృష్ణయ్య, వడెన్న, మాదవులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసీ చట్టం అమలుతోనే ఉపాధి అవకాశాలు



ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్యానెల్ సభ్యులు

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, అక్టోబర్ 18 : ఫార్మసీ యాక్ట్ అమలుతో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరి అన్నారు. ఫార్మసీ చదివిన నిరుద్యోగ యువతకు అవకాశాలు పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సరోజిని రాములమ్మ కళాశాలలో ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీచేస్తున్న సంజయ్‌రెడ్డి, కుమార్ ఎన్నికల ప్యానల్ అభ్యర్థులు కళాశాలలో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరి మాట్లాడుతూ.. ఫార్మసీ యాక్ట్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేస్తే ఫార్మాసిస్టులందరికీ ప్రయోజనం చేకూరుతుందన్నారు. కౌన్సిల్ సేవలను మరింత సులభతరం చేయాలన్నారు. ప్యానెల్ సభ్యుడు కుమార్ మాట్లాడుతూ.. సంజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయటానికి రాష్ట్రంలో మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో గుంటూరులోని ఫార్మసీ కౌన్సిల్‌ను హైదరాబాద్‌కు తీసుకురాగలిగారని, ఇందుకోసం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి విన్నవించగానే కౌన్సిల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కౌన్సిల్ ఎన్నికల్లో తమను గెలిపిస్తే ఫార్మసీ దుకాణాల్లో ఫార్మసిస్టులకు కనీస వేతనం రూ.30వేలు ఇప్పిస్తామన్నారు. మా ప్యానెల్ సభ్యులు సంజయ్‌రెడ్డి క్రమసంఖ్య–3, కుమార్–36, డాక్టర్ మహాలక్ష్మి–37, సందీప్ 58, సురేశ్ ఆనంద్ 63, వి.భాస్కర్‌రావు–75 సభ్యులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ కమిటీ ఎన్నిక

కోయిలకొండ, అక్టోబర్ 18 : మండలంలోని కొత్లాబాద్‌లో ముదిరాజ్ గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కావలి రాము ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా గోపాల్‌తోపాటు కార్యవర్గాన్ని ఎంపిక చేశారు.

# పల్లెల్లో ప్రగతి పరుగులు

- ఎనిమిదేండ్లలోనే అధికంగా అభివృద్ధి
- ఒక్కపొన్నకల్ గ్రామానికే రూ.28.17 కోట్లు మంజూరు
- ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న ప్రజలు



పొన్నకల్ అనుబంధ గ్రామం దుబ్బపల్లికి బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆల (ఫైల్)

మూసాపేట(అడ్డాకుల), అక్టోబర్ 18 : పల్లెల అభివృద్ధికి సీఎం కేసీఆర్ అత్యంత ప్రాధాన్యతను ఇవ్వడంతో గ్రామాలు మెరిసిపోతున్నాయి. పదేండ్ల కిందట రోడ్ల వెంట పారే మురుగు, వర్షాకాలంలో దోమలతో వ్యాపించే వ్యాధులు, గుంతలమయంగా రోడ్లు, బీటీ రోడ్డు లేక ప్రయాణికుల అవస్థలతో ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సీఎం కేసీఆర్ పల్లెల అభివృద్ధికి అధికంగా నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టడంతో అద్దంలా మెరిసే రోడ్లు, పల్లె ప్రకృతివనం, శ్మశానవాటిక, ఇంటింటికీ భగీరథ నీరు ఇలా చెప్పుకుంటూ పోతే అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. అడ్డాకుల మండలంలోని పొన్నకల్ ఒక్క గ్రామంలోనే 2018 నుంచి 2023 వరకు రూ.28,17,57,777లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని గ్రామ సర్పంచ్ కల్పనవిజయ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. పేదల సంక్షేమంతోపాటు గ్రామాల్లో అభివృద్ధికి అదేస్థాయిలో ప్రాధాన్యత ఇస్తున్నది. దీంతో దేశంలో తెలంగాణ రాష్ట్రంలోని పల్లెలకే ఎక్కువ ఉత్తమ పురస్కారాలు లభిస్తుండడమే అందుకు నిదర్శనం.

### 2018 తర్వాత అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలు ఇలా..

గ్రామంలోని 412 మందికి తెలంగాణ ప్రభుత్వం ప్రతి నెలా రూ.9,82,382, దాదాపుగా పది లక్షల వరకు మొత్తం నేటి వరకు 5,89,39,680లు అందజేసింది. రైతుబంధు పథకంతో గ్రామంలోని 1,005 మంది రైతులకు ఒక్క పంటకు రూ.కోటీ 13లక్షల 37,305లు కాగా, మొత్తం ఇప్పటి వరకు రూ.11కోట్ల 17లక్షల 57,472లు అందజేసినట్లు తెలిపారు. వివిధ కారణాలతో 24 మంది రైతులు మృతిచెందగా, ఆ కుటుంబాలు వీధిన పడకూడదని ప్రభుత్వం అమలు చేసిన రైతుబీమా పథకంతో మొత్తం 24 కుటుంబాలకు రూ.కోటీ 20లక్షలు అందజేసినట్లు తెలిపారు. గ్రామంలోని ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసిన తల్లిదండ్రులుకు చేతునిస్తూ కల్యాణలక్ష్మి, షాదీ ముభారక్ పథకంతో మొత్తం 50 కుటుంబాలకు రూ.50లక్షల 5,800లు అందజేసినట్లు తెలిపారు. కేసీఆర్ కిట్ పథకంలో 539 మందికి రూ.70లక్షల 7వేలు, 87 మందికి గొర్రెల పంపిణీ ద్వారా రూ.81లక్షల 97,500లు, సీఎం సహాయనిధి నుంచి 33 మందికి రూ.15లక్షల 7,284లు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణానికి రూ.29లక్షల 24,699లు, సీసీ రోడ్లకు రూ.కోటీ 3లక్షల 50వేలు, ఎల్‌వోసీల ద్వారా 10 మందికి రూ.12లక్షలు, 4 సామూహిక భవన నిర్మాణానికి రూ.34లక్షలు, పాఠశాల అవరణలో గోదాం మరమ్మతుకు రూ.5లక్షలు, మనఊరు – మనబడి పథకంలో రూ.82లక్షలు, వాగులో చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.4కోట్ల 50లక్షలు, హైమాస్ట్, ఎల్‌ఈడీ లైట్లకు రూ.24లక్షల 38,342లు, సెగ్రిగేషన్‌షెడ్ నిర్మాణానికి రూ.2లక్షల 10వేలు, హరితహారం వననర్సరీకి రూ.5లక్షలు, పల్లెప్రకృతి వనానికి రూ.4లక్షల 50వేలు, వైకుంఠధామం నిర్మాణానికి రూ.9లక్షల 50వేలు, గ్రామ పంచాయతీ ట్రాక్టర్, ట్యాంకర్, ట్రాలీ కొనుగోలుకు రూ. 9లక్షల 20వేలు, బీసీబంధు ద్వారా రూ.3లక్షలు లు అందజేయడంతో పాటు, 3వేల మందికి కంటి వెలుగు పథకం ద్వారా కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 760 ఇండ్లకు మిషన్ భగీరథ పథకం ద్వారా నల్లా కనెక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. ఇలా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపంలో గ్రామానికి వచ్చినట్లు వివరించారు. అదేవిధంగా అడ్డాకుల జెడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి గ్రామ పర్యటనకు వచ్చినప్పుడు గ్రామానికి చెందిన వాల్మీకులు, యాదవులు, సగరులు అంసపూర్తిగా ఉన్న సామూహిక భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరడంతో అందుకు జెడ్పీటీసీ సానుకూలంగా స్పందించి రూ. 7.50లక్షలు ఖర్చు చేసి పూర్తి చేసినట్లు తెలిపారు.

### గతంలో ఎప్పడూ ఇన్ని నిధులు రాలేదు..

గతంలో ఎన్నడూ ఇన్ని నిధులు గ్రామాభివృద్ధికి రాలేదు. ఎంపీపీ, జెడ్పీటీసీల సహకారంతో గ్రామానికి ఏం కావాలని అడిగినా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించారు. 2018 నుంచి ఇప్పటి వరకు అత్యధికంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రజలు ఆర్థికంగా స్థిరపడడంతోపాటు గ్రామం కూడా అభివృద్ధి సాధించింది.

**– కల్పనా విజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్, పొన్నకల్**

### ఎమ్మెల్యే కృషితోనే అభివృద్ధి సాధ్యమైంది..



ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నిరంతర కృషితోనే అధిక నిధులు వస్తున్నాయి. అభివృద్ధితోపాటు, సంక్షేమంపై దృష్టి పెట్టిన ఎమ్మెల్యే మరోవైపు సాగునీరు అందించేందుకు చేస్తున్న కృషి వర్ణణాతీతం. ఆయన కృషితోనే నేడు వాగులో చెక్‌డ్యాం నిర్మించుకున్నాం. మూసాపేట, కొమిరెడ్డిపల్లి గ్రామాల నుంచి కూడా గొలుసుకట్టు కాల్వల ద్వారా గ్రామ చెరువులకు సాగునీరు వచ్చేందుకు సొంత ఖర్చుతో కాల్వలను పూడిక తీయించారు. వ్యవసాయం కూడా పెరగడంతో రైతు కుటుంబాలకు ఎంతో మేలు జరిగింది. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని మరో మా భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం.

**– దోనూరు నాగార్జునరెడ్డి, ఎంపీపీ, పొన్నకల్**

# ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు



కోయిలకొండలో బతుకమ్మలతో విద్యార్థులు



జిల్లా కేంద్రంలో బతుకమ్మలతో ఆర్టీసీ ఉద్యోగులు

కోయిలకొండ, అక్టోబర్ 18 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు బతుకమ్మలను వివిధ పూలతో శోభాయమానంగా అలంకరించి నృత్యాలు చేశారు. అనంతరం పూజలు నిర్వహించి చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలనారాయణ, అధ్యాపకులు విజయ్‌కుమార్, రతన్‌లాల్, పారిజాత, నరసింహుడు, ప్రవల్లిక, రవి, రజిత, ఫహిమున్నీసా, ఖాజబేగం తదితరులు పాల్గొన్నారు.

**ఆర్టీసీ ఆధ్వర్యంలో..**

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబర్ 18 : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులతో విచ్చేసి తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో డీఎం సుజాత, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.